# రవీంద్ర గీతాంజలి

## అనువాదం:గాయత్రి



(గతసంచిక నుంచి తరువాయి)

***33***

**పగలు కాగానే నా యింటికొచ్చి వారడిగారు**

"మాకు కొద్ది స్థలం చాలిక్కడ" అని
"నీ ప్రభువు ఆరాధనలో సాయం చేస్తాం
ఆయన దయతో మావంతుగా స్వీకరించి"
అని చెప్పి ఒక మూల ఒదిగి మౌనంగా కూర్చొన్నారు.
కానీ, నిశి రేయిలో వారు
నా పవిత్రాలయంలో జొరబడి
ప్రభువుకు సమర్పించిన నైవేద్యాన్ని
బలంతో' విధ్వంసంతో లాగేసుకున్నారు!

***

*34*

**నా స్వంతం నీవేనని చెప్పేందుకై**
నాలో ఆ కొంచెం మాత్రం మిగుల్చు

నలు దెసలా నీవేననే భావనకై
అన్నిటానున్న నీ దరిజేరడానికై
ప్రతిక్షణం అనురాగార్పణకై
నాలో ఆ కొంచెం మాత్రం మిగుల్చు
నిను దాచుకోడానికై
నాలో ఆ కొంచెం మాత్రం మిగుల్చు

నీ ఆత్మతో బంధించుకోడానికై
జీవితంలో నీ ప్రయోజన సాధనకై
నాలో కొంచెం మాత్రం మిగుల్చు!

***

*35*

**ఎక్కడ మేధ భయంలేక తలెత్తుకు తిరుగుతుందో**

ఎక్కడ విద్య స్వేచ్ఛగా అందరికీ పంచబడుతుందో

ఎక్కడ సమాజం సంకుచితత్వపు అడ్డుగోడలతో విచ్ఛిన్నం కాదో

ఎక్కడ సత్యాంతరాళాల నుండి వాక్కులుద్భవిస్తాయో

ఎక్కడ అలుపెరుగని ప్రయత్నం పరిపుష్టికై బాహువులు విస్తరిస్తుందో

ఎక్కడ హేతువాదపు పిల్లకాలువ చావుతెలివిల ఎడారిలో ఇంకిపోదో

ఎక్కడ నీచే ప్రేరేపింపబడే మేధ ఆలోచనా, ఆచరణలని సంయమిస్తుందో

ఆ స్వాతంత్ర్య స్వర్గధామంలోకి, నా దేశాన్ని మేల్కొలుపు తండ్రీ!

***

## 36

ప్రభూ !

నా ప్రార్థన ఇది

ఎదలోని కోర్కెల వేర్లపై దాడి చేయి

సుఖదుఃఖాలను

తేలికగా భరించే శక్తినివ్వు

నీ సేవలో నా ప్రేమ ఫలించే శక్తినివ్వు

దీనుల నిరాకరించకుండేలా

కర్కశుల మోకరిల్లకుండేలా

నాకు శక్తి నివ్వు

దైనందిన విషయాలకతీతంగా

మేధ ఎదిగే శక్తి నివ్వు

నా శక్తిని నీకు ప్రేమార్పణ చేసే శక్తి నివ్వు!

***

(కొనసాగింపు వచ్చేసంచికలో)

POST YOUR COMMENTS